సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 10 । నవంబర్ । 2023



పార్కింగ్.. పరేషాన్!

కెరమెరి మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పార్కింగ్ స్థలాలు కరువయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్‌లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. IIIలో▸



ఆఖరు మజిలీకి కష్టాలు!

జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో నిర్మించిన శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. అరకొర వసతులు ఉన్నాయని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
33.6 /21.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

పోటాపోటీగా నామినేషన్లు

- గురువారం ఒక్కరోజే ఆసిఫాబాద్‌లో 11, సిర్పూర్‌లో ఐదు
- ఆలయాల్లో పూజలు నిర్వహించిన అభ్యర్థులు
- భారీ ర్యాలీలతో రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు..
- కార్యకర్తలు, నాయకులతో సందడి వాతావరణం
- చివరి రోజు శుక్రవారం మరింత మంది నామినేషన్ వేసే అవకాశం



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్/సిర్పూర్(టి): అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమైన నామినేషన్ల పర్వానికి శుక్రవారం ఒక్కరోజే గడువు మిగిలి ఉంది. దీంతో అభ్యర్థులు గురువారం పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతోపాటు స్వతంత్రులు సైతం జోరు చూపించారు. ముందు జాగ్రత్తగా పలువురు అభ్యర్థులు అదనపు సెట్లు సమర్పించారు.

ఆసిఫాబాద్‌లో ఏడుగురు..

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గురువారం ఒకే రోజు ఏడుగురు అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి రెండు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ మూడు సెట్లు, గోండ్వానా గణతంత్ర పార్టీ నుంచి ఆత్రం గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరితోపాటు బహుజన విముక్తి పార్టీకి చెందిన బుక్యా పల్లవి, స్వతంత్ర అభ్యర్థులుగా సిడాం అన్నిగా, మెస్రం నవీన్‌కుమార్, అడె బాలాజీ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి దాసరి వేణు తెలిపారు. ఇప్పటి వరకు ఆసిఫాబాద్‌లో 11 మంది అభ్యర్థుల తరఫున 15 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి ఉదయం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, కోవ అరుణ, సోదరి మర్సుకోల సరస్వతితో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఇర్ఫాన్ ఆమెకు ఇమామ్- ఏ- జామిన్ కట్టారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ జిల్లా కేంద్రంలోని తన నివాసం నుంచి అంబేద్కర్‌చౌక్, కుమురంభీం చౌక్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్ టాప్ జీపులో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు, ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలివచ్చారు.

ప్రత్యేక పూజలు

నామినేషన్లు వేసే ముందు అభ్యర్థులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంతోపాటు జన్కాపూర్ కోదండ రామాలయంలో కుటుంబ సమేతంగా పూజలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ జిల్లా కేంద్రంలోని షిర్డీ మందిరంలో పూజలు చేశారు. నామినేషన్ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే కోనప్ప నివాసంలో ఉదయం నుంచే సందడి నెలకొంది. ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఇంటి నుంచి సిర్పూర్(టి)కి ప్రత్యేక వాహనంలో బయలుదేరి, నాగమ్మ చెరువులోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు.

నేడే ఆఖరు..

నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరిరోజు కావడంతో మరింత మంది నామినేషన్లు దాఖలు చేసే వీలుంది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తరఫున ఆ పార్టీ నాయకులు అర్షద్ హుస్సేన్ ఇప్పటికే నామినేషన్ వేయగా, శుక్రవారం ఆర్‌ఎస్పీ స్వయంగా నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు సైతం సిర్పూర్‌లో ఎంపీ బండి సంజయ్‌తో కలిసి బహిరంగ సభ నిర్వహించి చివరి రోజే తన నామినేషన్ వేయనున్నారు.

సిర్పూర్‌లో ఐదు నామినేషన్లు..



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప

ఆరో రోజు గురువారం సిర్పూర్ నియోజకవర్గంలో మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 12కు చేరుకుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కోనేరు కోనప్ప మండల కేంద్రంలోని రిటర్నింగ్ కార్యాలయంలో కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, ఇతర నాయకులతో కలిసి నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్ బాబు తరఫున ఆ పార్టీ నాయకులు కొంగ సత్యనారాయణ, తదితరులు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే న్యూఇండియా పార్టీ అభ్యర్థి కోబ్రాగడె గంతీదాస్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి జాడి దీపక్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థిగా దుర్గం శ్యాంరావు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.



నామినేషన్ పత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్



నామినేషన్ వేస్తున్న బహుజన విముక్తి పార్టీ అభ్యర్థి పల్లవి

ఎన్నికల పోలీసు పరిశీలకుడిని కలిసిన కలెక్టర్



డీకే చౌదరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి గెస్ట్‌హౌజ్ వద్ద ఎన్నికల పోలీసు పరిశీలకుడు డీకే చౌదరిని గురువారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాకు వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ పనులు, జిల్లా భౌగోళిక పరిస్థితులు, అక్రమ మార్గంలో నగదు, ఉచితాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, భద్రతా పరంగా తీసుకుంటున్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్ హయాంలో అన్నివర్గాలకు అన్యాయం'



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

కాగజ్‌నగర్‌టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, 20 లక్షల మంది పోడు రైతులకు పట్టాలు అందలేదన్నారు. తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాల కలలు సాకారం కాలేదన్నారు. బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తరఫున సిర్పూర్ నియోజకవర్గంతోపాటు అన్ని నియోజవర్గాల్లో బీఎస్పీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ విద్యా వ్యవస్థలో పనిచేస్తూ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఐఈవో శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫాం- 12తోపాటు ఓటరు ఐడీ, డ్యూటీ ఆర్డర్ జిరాక్స్‌లను జతపరిచి రిటర్నింగ్ అధికారితోపాటు ప్రిన్సిపాళ్లకు అందించాలని సూచించారు.

సెలవు మార్పు చేయాలని వినతి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో స్థానిక సెలవు రోజు మార్పు చేయాలని గురువారం యూటీఎఫ్ నాయకులు జిల్లాకేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందురావు మాట్లాడుతూ గత నెల 28న కుమురంభీం వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు జిల్లాలో సెలవు రోజుగా ప్రకటించి బదులుగా ఈ నెల 11న రెండో శనివారం పని దినంగా పేర్కొన్నారని తెలిపారు. అయితే 12న దీపావళి పండుగ ఉన్న నేపథ్యంలో దూరప్రాంతాలకు వెళ్లే ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ఈ నెల 11కు బదులుగా డిసెంబర్ 9న పనిదినంగా మార్పు చేయాలని కోరారు. ప్రత్యేక సందర్భాల్లో సెలవులు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. నాయకులు ఊషన్న, హరీశ్ పాల్గొన్నారు.

సత్వర న్యాయం రాజ్యాంగం కల్పించిన హక్కు



ర్యాలీ నిర్వహిస్తున్న లీగల్ సర్వీసెస్ కార్యదర్శి యువరాజ, తదితరులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఉచిత న్యాయ సహాయం పాటు సత్వర న్యాయం పొందే హక్కు ఆర్థికంగా వెనుకబడిన వారికి రాజ్యాంగం కల్పించిందని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గార్డెన్ కె.యువరాజ అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 39ఏ ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం సత్వరమే పొందవచ్చన్నారు. దేశంలోని బలహీన వర్గాలకు ఉచిత, సమర్థ న్యాయసేవలు అందించాలనే ప్రాథమిక లక్ష్యంతో లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987 రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థికి హక్కులతోపాటు బాధ్యతలు తెలిసి ఉండాలన్నారు. హక్కులు సమర్థవంతంగా వినియోగించుకుంటూనే బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి కళాశాల ఎదుట 'నో ర్యాగింగ్' బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జాతీయ గీతాన్ని ఆలపించాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జాకీర్ ఉస్మానీ, న్యాయవాది నరహరి, అసిస్టెంట్ లీగల్ డిఫెన్ అంజనీదేవి, పారా లీగల్ వాలంటీర్ జయరాజ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'టీచర్ల సమస్యలపై పోరాటమే లక్ష్యం'



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: టీచర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయడమే తమ లక్ష్యమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో గురువారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను ఆయన అభినందించారు. జిల్లా అధ్యక్షుడిగా చునార్కార్ తుకారం, అసోసియేట్ అధ్యక్షులుగా కాళిదాసు, బడిరాం, జిల్లా ఉపాధ్యక్షులుగా సంతోష్, శారద, గణేశ్, ఎస్.సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దురిశెట్టి రాజశేఖర్, కార్యదర్శులుగా భాగ్యశ్రీ, అన్నపూర్ణ, అరుణ్ తదితరులు ఎన్నికయ్యారు.

సిడాం అన్నిగాకు బీసీ సంఘం మద్దతు



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సిడాం అన్నిగాకు జిల్లా బీసీ సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించింది. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ మాట్లాడారు. గత పాలకులు బీసీలను పట్టించుకోలేదని, జిల్లా కేంద్రంలో బీసీ స్టడీసర్కిల్ ఏర్పాటు చేయకుండా అవమానపరిచారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేసన్ వేసిన సిడాం అన్నిగాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. త్వరలో అన్ని గ్రామాల్లో పర్యటించి బీసీలను ఏకం చేసి, అన్నిగాను భారీ మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీంరావు, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి, నాయకులు బాలేశ్, ప్రశాంత్, సాయికృష్ణ, ఆత్రం భీంరావు, జలపతిరావు, తిరుపతి, నాగోరావు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కోట్నాక విజయ్ రాజీనామా

ఆసిఫాబాద్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఓడిపోయే వ్యక్తికి బీజేపీ టికెట్ ఇచ్చినందుకు నిరసనగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. కొన్నేళ్లుగా పార్టీ ఆదేశాల మేరకు పల్లెపల్లెకూ బీజేపీని బలోపేతం చేశానన్నారు. కొంత మంది కుట్రతో తనకు టికెట్ రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆసిఫాబాద్‌లో నామినేసన్ దాఖలు చేస్తానని వెల్లడించారు.

మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: వేధింపులు, దాడులపై మహిళలు, యువతులు మౌనం వీడి ధైర్యంగా పోలీసులు, షీటీం సభ్యులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు పర్యవేక్షణలో షీటీం గత నెలకు సంబంధించిన పని తీరు వివరాలను గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్టోబర్ నెలలో షీటీంకు బాధితుల నుంచి ఐదు ఫిర్యాదు వచ్చాయని, వాటిలో కౌన్సెలింగ్ ద్వారా 4, ఎఫ్ఐఆర్ ద్వారా 1 నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలను వేధించే ఆకతాయిలకు షీటీం పోలీసులు కళ్లెం వేస్తున్నారని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను వెంబడిస్తూ వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకుని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు వెల్లడించారు. తొలిసారి చేసిన తప్పిదానికి కేసు నమోదు చేస్తున్నామని, పునరావృతమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంతో షీటీం నంబర్ 87126 70564ను సంప్రదించాలని కోరారు.

మబ్బులతో గుబులు

- ముమ్మరంగా వరికోతలు, పత్తితీత పనులు
- రెండు, మూడు రోజులుగా మారిన వాతావరణం
- ఆకాశం మేఘావృతం కావడంతో అన్నదాతల్లో ఆందోళన
- ఈ సమయంలో వర్షం పడితే తీవ్ర నష్టం



దహెగాంలో ఆరబెట్టిన వరి ధాన్యం

దహెగాం(సిర్పూర్): వాతావరణ మార్పులు రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా ఆకాశం మబ్బులు పట్టి ఉండటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో వర్షం కురవడంతో పంట రక్షణకు దిగులు చెందుతున్నారు. వరి కోతలు జోరందుకున్న సమయంలో అకాల వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామని వారు పేర్కొంటున్నారు.

జోరందుకున్న పనులు

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా పత్తి 3.50 లక్షల ఎకరాల్లో సాగవుతుండగా, వరి 53 వేల ఎకరాలకు పైగా సాగవుతోంది. దహెగాం, కౌటాల, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, బెజ్జూర్, కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, రెబ్బెన మండలాల్లో వరి సాగు అధికంగా ఉంటుంది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదు కావడంతో వరి సాగు మెరుగ్గానే ఉంది. ప్రస్తుతం పత్తి తీత పనులు కొనసాగుతుండగా, పలుచోట్ల వరి కోతలు కూడా జోరందుకున్నాయి. నాట్లు ఆలస్యమైన ప్రాంతాల్లో వరి పొట్ట దశలో ఉంది. కోతలు పూర్తయిన రైతులు ధాన్యం కుప్పలను వరి పొలాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకు ఆరబెడుతూ రాత్రి కుప్పగా పోసి టార్పలిన్లు కప్పుతున్నారు.

వానపడితే తీవ్ర నష్టం..

ఈ ఏడాది వానాకాలం సీజన్ రైతులకు కలిసిరావడం లేదు. సీజన్ ప్రారంభంలో వర్షాలు ఆలస్యం కావడంతో సాగు పనులు నెమ్మదిగా సాగాయి. ఆ తర్వాత సెప్టెంబర్ నుంచి వర్షాలు పడటంతో జోరందుకున్నాయి. అధిక వర్షాలు, వరదలతో జిల్లాలో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. మళ్లీ అక్టోబర్ నుంచి ఎండలు పెరిగిపోవడం, చినుకు జాడ లేకపోవడంతో పత్తిమొక్కల ఎదుగుదల నిలిచిపోయింది. వరి సాగు చేసిన రైతులు చివరి తడులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దిగుబడులు తగ్గుతాయనే ఆందోళనలో అన్నదాతలు ఉండగా.. ప్రస్తుతం ఆకాశం మబ్బులు పట్టి ఉండటం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ధాన్యం కుప్పలకు టార్పాలిన్లు కప్పుకోవాలని, లోతట్టు ప్రాంతాల నుంచి ధాన్యాన్ని వేరే ప్రాంతాలకు తరలించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అలాగే చేల నుంచి తీసిన పత్తి పంటను ఆరుబయట ఉంచొద్దని వారు పేర్కొంటున్నారు.

వర్షం పడితే నష్టపోతం



పత్తి కాతపూత దశలో వర్షాలు లేక దిగుబడి తగ్గింది. పెట్టుబడి కూడా వస్తదో రాదో తెలియదు. పత్తి కాయలు పగులుతున్నాయి. అకాల వర్షం పడితే పత్తి తడిసి నల్లగ అయితది. అమ్మడానికి పోతే పత్తి నల్లగ ఉందని, ధర తక్కువ అంటరు. ఇప్పుడు వర్షం పడితే బాగా నష్టపోతం.

– సంజీవ్, దిగిడ, మం.దహెగాం

వరి కోతకు వచ్చింది



వానాకాలం సీజన్‌లో 12 ఎకరాల్లో వరి సాగు చేసిన. అందులో ఆరెకరాలు కౌలుకు తీసుకున్న. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో కోతకు వచ్చిన పంట నష్టపోయే ప్రమాదం ఉంది. రూ.లక్షల పెట్టుబడి పెట్టినం. ఏటా అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నం. మబ్బులను చూస్తే భయమేస్తోంది.

– చెమ్మకారి గంగన్న, లగ్గాం, మం.దహెగాం

క్లుప్తంగా

రైలు కిందపడి ఒకరు మృతి

రామకృష్ణాపూర్‌(చెన్నూర్‌): రవీంద్రఖని–మంచిర్యాల రైల్వేస్టేషన్ల మధ్య క్యాతనపల్లి రైల్వే గేటు సమీపంలో గురువారం గుర్తు తెలియని వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందినట్లు మంచిర్యాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ రాజేశ్వర్‌ తెలిపారు. మృతుని వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు మృతి చెందాడా? తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైద్యురాలిని వేధించిన ముగ్గురికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: వైద్యురాలిని వేధించిన కేసులో ముగ్గురు యువకులకు ఏడాది జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి కే.ప్రభాకరరావ్‌ గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ రాజు తెలిపారు. కాలేజ్‌రోడ్‌ గర్మిళ్లకు చెందిన ఓ ప్రభుత్వ వైద్యురాలిని అదే ప్రాంతానికి చెందిన అట్లా సంతోష్‌, మాటేటి శ్రావణ్‌, అందే అశోక్‌ కొంతకాలంగా వెంబడించేవారు. 2018 మే 27న నైట్‌ డ్యూటీకి వెళ్తుండగా ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెంబడించి వేధింపులకు గురిచేయడంతో 2018 మే 30న స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో రెండో అదనపు కోర్టు శిక్ష ఖరారు చేసింది. దీంతో నిందితులు జిల్లా కోర్టుకు అప్పీల్‌కు వెళ్లారు. జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావ్‌ కేసును విచారించిన అనంతరం నిందితుల అప్పీల్‌ను కొట్టివేస్తూ అదేతీర్పును ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

చదువుతోనే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట(బెల్లంపల్లి): చదువుతోనే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నిండుతాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మండలంలోని దేవాపూర్‌ సల్పాలవాగులో గురువారం దండారీ దర్బార్‌ నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ఉదయం నుంచి దండారీ నృత్యం చేస్తూ దర్బార్‌ నిర్వహించారు. అధికసంఖ్యలో హాజరైన ఆదివాసీలు, గిరిజనేతరులు దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఆదివాసీ తమపిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూ.25 లక్షలతో ఆదివాసీలకు కమ్యూనిటీహాల్‌ నిర్మించనున్నట్లు తెలిపారు. వచ్చిన భక్తులకు దేవాపూర్‌ ఓరియంట్‌ సిమెంట్‌ కంపెనీ ఆధ్వర్యంలోభోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మద్దిమాడ సర్పంచ్‌ ఆడె జంగు, జెడ్పీటీసీ చంద్రయ్య, ఓరియంట్‌ హెచ్‌ఎం జీఎం కులకర్ణి, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో ‘చీకటి’

- మూతబడిన శాలీవాహన పవర్‌ ప్లాంట్‌
- కార్మికులకు అందని బెనిఫిట్స్‌
- ఆర్థిక ఇబ్బందుల్లో వంద కుటుంబాలు



నినాదాలు చేస్తున్న కార్మికులు (ఫైల్‌)



శాలీవాహన పవర్‌ప్లాంట్‌ (ఫైల్‌)

పాతమంచిర్యాల: శాలీవాహన గ్రీన్‌ ఎనర్జీ పవర్‌ ప్లాంట్‌లో పనిచేసిన కార్మికుల జీవితాల్లో ఏడాదికాలంగా చీకట్లే అలుముకున్నాయి. పవర్‌ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేసి దాదాపు ఏడాదికాలం పూర్తయ్యింది. పవర్‌ప్లాంట్‌లో నష్టాలు వస్తున్నాయని యాజమాన్యం డిశంబర్‌ 06 2022న కంపెనీని మూసివేసింది. అప్పటి నుంచి కంపనీలో పనిచేస్తున్న 100 మంది శాశ్వత, 100 మంది దినసరి కూలీలకు ఉపాధి లేకుండా పోయింది. కంపెనీని అధికారికంగా మూసివేస్తున్నామని ప్రకటించిన యాజమాన్యం కార్మికులకు రావాల్సిన జీతభత్యాలు, గ్యాట్యుటీ, ఇన్‌సెంటివ్‌లు చెల్లించాల్సి ఉండగా అవేం లేకుండానే ఏడాదికాలంగా కార్మికులను తిప్పుకుంటున్నారని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. లేబర్‌ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్లాంట్‌ యజమాని మల్క కొమురయ్య స్పందించడంలేదన్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న తన ఇంటికి వెళ్లి కలిసినా వెళ్లినప్పుడల్లా ఏదో ఒక కారణం చెప్పి కాలయాపన చేశారన్నారు. పవర్‌ప్లాంట్‌కు ట్రాన్స్‌కో నుంచి రావాల్సిన రూ.10 కోట్లను కార్మికులకు జీతభత్యాల కింద జమ చేస్తామని నమ్మించి ట్రాన్స్‌కో ఇచ్చిన రూ.10 కోట్లను బ్యాంకు ద్వారా డ్రా చేసుకుని సొంతానికి వాడుకున్నాడని కార్మికులు వాపోయారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్‌లు ఇవ్వడంలో కావాలనే యాజమాన్యం జాప్యం చేస్తుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. శాశ్వత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు వస్తాయని, అవి వస్తే ఏదైనా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవచ్చని ఆశపడితే యాజమాన్యం కాలయాపన చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కంపెనీలోని సామగ్రి పూర్తిగా తరలించిన తర్వాతే కార్మికులకు బెనిఫిట్స్‌ సెటిల్‌మెంట్‌ చేస్తామని మంచిర్యాల అసిస్టెంట్‌ లేబర్‌ కమిషనర్‌కు రాతపూర్వకంగా లెటర్‌ రాసి ఇచ్చినట్లుగా తెలిసిందని కార్మికులు తెలిపారు. తమకు రావాల్సిన జీత భత్యాలు, బెనిఫిట్స్‌ చెల్లించనిదే కంపెనీలోని ఒక్క వస్తువు కూడా తరలించేది లేదని కార్మికులు పట్టుదలతో ఉన్నారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కార్మికులు డిమాండ్‌ చేస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి

శాలీవాహన పవర్‌ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన జీత భత్యాలు, ఏరియర్స్‌ చెల్లించాలని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చాం. కంపెనీ ప్రొప్రయిటర్‌ మల్క కొమురయ్య, డైరెక్టర్‌ నవీన్‌ ఏదోఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తూవచ్చారు. కావాలని నష్టాలు చూపించి ప్లాంట్‌ను మూసివేసి కార్మికులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌ ఇచ్చిన తర్వాతే ప్లాంట్‌లోకి అడుగు పెట్టనిస్తాం. – కుంటాల శంకర్‌, పవర్‌ప్లాంట్‌ కార్మిక సంఘం అధ్యక్షుడు

కోవ లక్ష్మి ఆస్తి రూ.1.18 కోట్లు



కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌: ఆసిఫాబాద్‌ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోవ లక్ష్మి మొత్తం ఆస్తి విలువ రూ.1,18,80,862, ఉన్నట్లు గురువారం సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన వద్ద రూ.2 లక్షలు, భర్త సోనేరావు వద్ద రూ.50 వేల నగదు ఉన్నట్లు వివరించారు. రూ.80,50,862 స్థిరాస్తులు, రూ.38,30,000 విలువైన చరాస్తులు, రూ.42,50,862 విలువైన బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. భర్త సోనేరావు పేరుతో రూ.1,14,54,291 ఆస్తి ఉండగా ఇందులో రూ.18,24,391 విలువైన స్థిరాస్తి, రూ.96,30,000 విలువైన చరాస్తి ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.20 లక్షల విలువైన ఇన్నోవా, రూ.18 లక్షల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. భర్త పేరుతో రూ.13 లక్షల విలువైన బొలేరో వాహనం, రూ.2.40 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. తన పేరుతో మహేంద్ర అండ్‌ మహేంద్రలో రూ. 8 లక్షల రుణం, సోనేరావు పేరుతో రూ.6 లక్షల రుణం ఉన్నట్లు పేర్కొన్నారు. 2018 ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో కోవ లక్ష్మి వద్ద రూ.లక్ష నగదు, సోనేరావు వద్ద రూ.10 వేలు ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.21 లక్షల విలువైన స్థిరచరాస్తులు, భర్త సోనేరావు పేరుపై రూ.50 వేల ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. కోవ లక్ష్మి పేరుమీద 3.25 ఎకరాలు, సోనేరావు పేరుమీద 5.30 ఎకరాలు, నివాస భవనం ఉన్నట్లు పేర్కొన్నారు.

శ్యాంనాయక్‌ ఆస్తి రూ.1.95 కోట్లు



శ్యాంనాయక్‌

ఆసిఫాబాద్‌: ఆసిఫాబాద్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్మీరా శ్యాంనాయక్‌ మొత్తం ఆస్తి విలువ రూ.1,95,63,841 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో రూ.84,34,111 విలువైన బ్యాంకు డిపాజిట్లు, నగదు, స్థిరచరాస్తులు, రూ.1,11,29,730 విలువైన 5.12 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో ఇల్లు, 200 గజాల ప్లాటు, 1000 గజాల స్థలం ఉంది. రూ.37 లక్షల విలువ చేసే ఫార్చునర్‌ వాహనం ఉంది. అప్పులు లేవు. ఆయన భార్య, ఎమ్మెల్యే రేఖానాయక్‌ మొత్తం ఆస్తి విలువ రూ.10,63,79,190 ఉండగా ఇందులో రూ.6,78,79,190 విలువైన నగదు, బ్యాంకు డిపాజిట్లు, రూ.3,85,00,000 విలువైన 28.39 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఖానాపూర్‌లో ఇల్లు, 5,500 గజాలు, 2000 గజాల స్థలాలు ఉన్నాయి. రూ.30 లక్షల విలువైన ఇన్నోవా, రూ.75 లక్షల విలువైన బెంజ్‌ కారు ఉన్నాయి. ఎస్‌బీఐలో రూ.18,95,820 సీసీ లోన్‌, రూ.1,57,45,721 టర్మ్‌లోన్‌, ఆక్సిస్‌ బ్యాంక్‌లో రూ.57,13,664 కార్‌లోన్‌ ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

పీఎస్సార్‌ ఆస్తులు రూ.54.80 కోట్లు

- అప్పులు రూ.7.50 కోట్లు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి



నామినేషన్‌ వేసేందుకు వచ్చిన ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్‌ అభ్యర్థిగా కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు గురువారం నామినేషన్‌ దాఖలు చేశారు. తమ కుటుంబ ఆస్తులు దాదాపు రూ.54.80 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గతేడాది ఇన్‌కాంట్యాక్స్‌ రూ. 29,58,050 చూపించగా తన భార్య సురేఖ పేరిట రూ.4,50,280 చూపించారు. పీఎస్సార్‌ వద్ద రూ.6,26,300, సురేఖ వద్ద రూ. 4,22,350 నగదుతో పాటు ఇతర చరాస్తులన్నీ కలిపి పీఎస్సార్‌ వద్ద రూ.13,64,80,168, సురేఖ వద్ద రూ.1,12,00,654 ఉన్నట్లు పేర్కొన్నారు. స్థిరాస్తుల్లో కాసిపేట మండలం కొండాపూర్‌లో 9.08 ఎకరాల భూమి, హైదరాబాద్‌లోని బేగంపేట్‌, మంచిర్యాలలో భవనం ఉన్నాయి. వాటి విలువ రూ.35,65,11,900, వారసత్వంగా వచ్చిన ఆస్తి రూ.90,80,000, తన భార్య పేరిట స్థిరాస్తులు 3,14,00,000, వీటన్నింటి విలువ రూ.54,80,81,052గా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వీటితో పాటు వివిధ బ్యాంకుల్లో రుణాలు, ఫైనాన్స్‌ రూపంలో రూ.7.50 కోట్ల అప్పు, ప్రభుత్వానికి వివిధ రూపాల్లో చెల్లించాల్సిన బకాయిలు రూ. 2,64,08,801గా చూపించారు. ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు పలు వ్యాపారాలు, పెన్షన్‌ రూపంలో ఆదాయం వస్తున్నట్లు చూపించారు. ప్రేమ్‌సాగర్‌రావు మీద ఉట్నూర్‌, మంచిర్యాల, సీసీసీ నస్పూర్‌, లక్సెట్టిపేట్‌, హాజీపూర్‌, సికింద్రాబాద్‌, నాంపల్లిలో మొత్తం 40 కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

దివాకర్‌రావు ఆస్తులు రూ.8.87 కోట్లు



నామినేషన్‌ వేసేందుకు వచ్చిన దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న నడిపెల్లి దివాకర్‌రావు కుటుంబ ఆస్తి విలువ దాదాపు రూ.8.87 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో తన సొంత ఆస్తులు, వారసత్వంగా వచ్చినవి, తన పేరిట, తన భార్య పేరిట ఉన్న ఆస్తులు, భూములు, బంగారంకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గతేడాది ఇన్‌కంట్యాక్స్‌ తన పేరిట రూ.1.90 లక్షలు, తన భార్య పేరిట రూ.4,01,550లు చూపించారు. చరాస్తులు ఆయన పేరిట రూ.86,22,715, భార్య పేరిట రూ.16,84,153, స్థిరాస్తులు తన పేరిట రూ. 2,87,50,000, భార్య పేరిట రూ.40 లక్షలు, వారసత్వంగా వచ్చిన ఆస్తులు తన పేరిట రూ.2.05 కోట్లు, భార్య పేరిట రూ.2.50 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తన చేతిలో రూ.1.20 లక్షలు, తన భార్య వద్ద రూ.90 వేల నగదు ఉన్నట్లుగా చూపించారు. మహేశ్వరం మండలంలోని తూప్రాలో, మంచిర్యాల, పాతమంచిర్యాలలో ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, మంచిర్యాల, పాతమంచిర్యాలలో రెండు ఇళ్లు, రూ.13.20 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు ఉన్నట్లుగా చూపించారు. తన పేరిట ఎక్కడా ఒక్క పోలీసు కేసు కూడా నమోదు కాలేదన్నారు. బ్యాంకులు, ఇతరత్రా అప్పులు తన పేరిట లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.


బాల్క సుమన్‌ ఆస్తి రూ.5.90 కోట్లు



బాల్క సుమన్‌

చెన్నూర్‌: చెన్నూర్‌ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌ ఆస్తి రూ.5,90,73,438 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో సుమన్‌ పేరు మీద రూ.4,31,80,316, అతని భార్య రాణి అలేఖ్య పేరు మీద రూ.65,77,074, తల్లి సుమ పేరు మీద రూ.33,21,148, పెద్ద కుమారుడు సుహాన్‌ పేరుమీద రూ.30 లక్షలు, చిన్న కుమారుడు సుశాన్‌ పేరిట రూ.30 లక్షల డిపాజిట్లు ఉన్నాయి. రూ. 2,50 లక్షల విలువ గల స్థిరచరాస్తులు, క్యాతన్‌పల్లిలో రూ.74,22,180 విలువ గల భూమి, బాల్క సుమన్‌ పేరు మీద భీమారం మండలం అంకూపూర్‌లో 12.03 ఎకరాల రూ.16,03,980 విలువ గల వ్యవసాయ భూమి, ఇన్నోవా క్రిస్టా వాహనం, వివిద బ్యాంకులలో రూ.85,41,535 డిపాజిట్లు, అప్పులు రూ.1,42,85,059 ఉన్నట్లు ఆయన వివరించారు.

కోనేరు కోనప్ప ఆస్తులు రూ.89.93 లక్షలు



ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల: సిర్పూర్‌(టి) నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆస్తులు రూ.89.93 లక్షలు ఉన్నట్లు గురువారం ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించారు. యూనియన్‌ బ్యాంకు కాచిగూడలో ఫిక్స్‌డ్‌ డిపాజిట్లు రూ.74,069, ఎస్‌బీఐ సెక్రెటరేట్‌ శాఖలో రూ. 3,06,958, కాగజ్‌నగర్‌ ఎస్‌బీఐ బ్యాంకులో ఎన్నికల కోసం రూ.40,00,500, రూ.16 లక్షల విలువైన ఇన్నోవా కారు, ఐదు తులాల బంగారం రూ.3 లక్షలతో కలిపితే రూ.63,89,527 లక్షల చరాస్తులున్నట్లు చూయించారు. స్థిరాస్తిలో కాగజ్‌నగర్‌ మండలం సర్వే నంబర్‌ 47/13లో ఓ 3.300 గుంటలు, సర్వే నెంబర్‌ 176/2 కొత్తపేటలో 0.2000 గుంటల భూమి ఉన్నట్లు వెల్లడించారు. గుంటూర్‌ కాలనీలో 3600 స్కేర్‌ ఫీట్ల ఇల్లు ఉన్నట్లు చూయించారు. సతీమణి కోనేరు రమాదేవి పేరిట పోస్టాఫీసుల్లో రూ. 3,715, రూ.14వేలు, రూ.14వేలు, రూ.14 వేల నగదుతో పాటు 40 తులాల బంగారం ఉన్నట్లు ఇందుకు ధర రూ. 24 లక్షలతో మొత్తం 26,03,715 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

వివేకానంద్‌ ఆస్తి రూ.537 కోట్లు



గడ్డం వివేకానంద్‌

చెన్నూర్‌: చెన్నూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ అభ్యర్థి గడ్డం వివేకానంద్‌ ఆస్తి రూ.537,67,40,482 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. అతని భార్య సరోజ పేరుమీద రూ.65,48,26,389, వివేక్‌ పేరు మీద రూ.209,38,19,850 కోట్ల విలువ గల భూములు, భార్య సరోజ పేరు మీద రూ.16,53,28,850 కోట్ల విలువ గల స్థిరచరాస్తులు, కుటుంబ సభ్యుల పేరు మీద రూ.41,54,87,569 అప్పులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రలోభాలను పట్టేసుకుంటారు..



ఫ్లయింగ్‌ వాహనంపై సీసీ కెమెరా

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రలోభాలకు పాల్పడకుండా ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగదు, కానుకలు ఓటర్లకు చేరవేయకుండా ఉండేందుకు ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం పెద్ద ఎత్తున వాహనాల్లో గస్తీ చేపడుతుంది. అయితే ఇటీవల వీరి వాహనాలకు 360 డిగ్రీలు తిరుగుతూ రికార్డింగ్‌ చేసేలా ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ వాహనానికి జీపీఎస్‌ కూడా ఉండటం, సీసీ కెమెరా పనితీరు మొత్తం ఎన్నికల కమిషన్‌కు అనుసంధానంగా ఉండటంతో వీరి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటుంది. ఓటర్లకు పంచే నగదు, నగలు, కానుకలను గుర్తించడంతో పాటు వాటిని పట్టుకుంటుంది. పోలింగ్‌ జరిగేంత వరకు ఈ వాహనాలు నిరంతరం చక్కర్లు కొడుతూ నిఘా ఉంచుతాయి.

‘గిరి’ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు



సంప్రదాయ వేషధారణలో ఆదివాసీలు



ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్న ఆదివాసీలు



సంప్రదాయ పూజల్లో గిరిజనులు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): హాజీపూర్‌ మండలంలోని ముత్రిగూడెం, నాగారం, చిన్నగోపాల్‌పూర్‌ గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు దండారీ ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. దీపావళిని పురస్కరించుకుని గోండుతెగకు చెందిన ఆదివాసీలు ఖాఖోభాయి ఆలయ భేటీకి వెళ్లివచ్చి ఎత్మల్‌సార్‌–గుమ్మెల దండారీ ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరపనున్నారు. ప్రత్యేక వేషధారణలో డప్పుచప్పుళ్ల మధ్య సంప్రదాయ నృత్యం చేస్తూ తమ ఆరాధ్య దేవతకు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఊరు పోచమ్మ, హనుమాన్‌ ఆలయాలతో పాటు సకల దేవుళ్లకు పూజలు చేశారు. దీపావళి మరుసటి రోజున గంగస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ముగిస్తారు. అనంతరం పంట కోతలు ప్రారంభిస్తామని ఆదివాసీలు పేర్కొన్నారు. ఉత్సవాల్లో దండారీ పెద్దలు పెంద్రం మారు, పెంద్రం లస్మ, సోనేరావు, ధర్మారావు, సురేష్‌ పటేల్‌, తెలంగారావు, యువకులు శ్రావణ్‌, రాజ్‌కుమార్‌, రాకేశ్‌, తిరుపతి, అర్జున్‌, రాంచందర్‌, మనోజ్‌ పాల్గొన్నారు.

‘ఆర్‌ఎస్పీ వైఖరి నచ్చకనే రాజీనామా’



మాట్లాడుతున్న రమేశ్‌

మందమర్రిరూరల్‌: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ వైఖరి నచ్చకనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చెన్నూర్‌ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేశ్‌ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేసిన తనకు కాకుండా కొత్తగా కాంగ్రెస్‌ పార్టీ నుంచి వచ్చిన వారికి టిక్కెట్‌ ఇచ్చారన్నారు. ఆయన వైఖరి నచ్చకనే పార్టీకి తనతో పాటు తన అనుచరులు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తను ఏ పార్టీలో చేరడం లేదని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌, తిరుపతి, లక్ష్మణ్‌, అశోక్‌, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

అజ్జు వచ్చేశాడు..

- కరోనాకు ముందు ఇంటినుంచి బయటికి వెళ్లిన యువకుడు
- ఐదేళ్ల తర్వాత ఇంటికి వచ్చిన వైనం



తల్లిదండ్రులతో అజ్జు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): మతిస్థిమితం లేని ఆ యువకుడు కరోనాకు ముందు వెళ్లి ఐదేళ్లకు ఇంటికి తిరిగివచ్చాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్‌ మండలం నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. నర్సింగాపూర్‌కు చెందిన హమీదా, భాషా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు అజ్జు మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. 2019లో కరోనా సమయంలో కనుమరుగయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం వారి బంధువైన మహ్మద్‌ షరీఫ్‌ హైదరాబాద్‌కు వెళ్లగా అక్కడ ఓ హోటల్‌ ఎదుట అజ్జును చూసి ఒక్కసారిగా షాకయ్యాడు. వెంటనే అజ్జు తల్లిదండ్రులకు సమాచారం అందించగా గురువారం ఇంటికి తీసుకువచ్చారు. ఐదేళ్లకు ఇంటికి వచ్చిన కుమారుడిని అక్కున చేర్చుకున్న తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

బైక్‌ ఢీకొని యువకుడి మృతి

తలమడుగు: బైక్‌ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. తాంసి మండలంలోని లింగుడ గ్రామానికి చెందిన టేకం సోనేరావు(25) దండారీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్‌ గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. సోనాపూర్‌ గ్రామ సమీపంలో వెనుక నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న నాందేడ్‌ జిల్లాకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

59 ఎక్సైజ్‌ కేసులు నమోదు

ఆదిలాబాద్‌టౌన్‌: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు నెల రోజుల్లో 59కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ‘సాక్షి’కి తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.69లక్షల 93వేల 500 విలువ గల మద్యం, నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 147 లీటర్ల గుడుంబా, 8 కిలోల గంజాయి, 342 గంజాయి మొక్కలు, 12 లీటర్ల మద్యం, 250 కిలోల బెల్లం, 20 కిలోల పటిక, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్‌ చేసినట్లు తెలిపారు. 17 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.